# భూములకు దేశవ్యాప్తంగా గుర్తింపు

- రైతులకు ఈ ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు
- ఏప్రిల్ 22 నుంచి జారీకి కేంద్రం సిద్ధం

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

భారతదేశంలోని రైతుల భూములకు సమగ్ర గుర్తింపు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రైతులకు భూమిపై అధికార హక్కులను నిర్ధారించేలా "ఫార్మా రిజిస్ట్రీ కార్డ్"లను జారీ చేయనున్నట్లు ప్రకటన చేసింది. ఈ నెల 22వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

**ఫార్మా రిజిస్ట్రీ కార్డు అంటే ఏమిటి..?**

ఫార్మా రిజిస్ట్రీ కార్డు ఒక యూనిక్ ఐడెంటిఫికేషన్ డాక్యుమెంట్. ఇది ఆ రైతు భూమిపై ఉన్న హక్కును స్పష్టంగా నమోదు చేస్తుంది. ఈ కార్డు ద్వారా వ్యవసాయదారుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందే అన్ని రకాల సబ్సిడీలు, రుణాలు, భీమా, పీఎం కిసాన్ వంటి ప్రయోజనాలకు అర్హత పొందుతాడు.

**పోర్టల్ ఆధారిత సిస్టమ్..**

"ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్" పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నారు. ఈ పోర్టల్‌కి




భూమి ఆధారిత సమాచారం, ఆధార్, భూ పాస్‌బుక్, పంటల వివరాలు, బ్యాంక్ ఖాతా వంటి అంశాలు ఒకే వేదికపై సమీకరించబడతాయి. ఇందువల్ల డూప్లికేట్ లాభదారుల సమస్య తగ్గుతుంది.--
భవిష్యత్తులో ప్రయోజనాలు..రైతుకు ఉన్న భూమికి దేశంలో ఎక్కడైనా గుర్తింపు రుణాల దరఖాస్తులో తక్షణ ప్రాసెసింగ్ భూ సమస్యల పరిష్కారానికి ఆధారంగా ఉపయోగపడే పత్రం. సబ్సిడీ, బీమా వంటి ప్రయోజనాలకు వేగంగా లబ్ధి

**22 నుంచి పథక ప్రారంభం..**

ఏప్రిల్ 22న పుణేలో జరిగే రైతు సభలో కేంద్ర మంత్రి అర్జున్ ముండా ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. ముందుగా పంజాబ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ సహా 10 రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని పైలట్‌గా అమలు చేయనున్నారు. అనంతరం దశలవారీగా మిగిలిన రాష్ట్రాల్లో విస్తరిస్తారు.

**తెలంగాణపై ప్రభావం..**

తెలంగాణలో ఇప్పటికే ధరణి పోర్టల్ ద్వారా భూ డిజిటలైజేషన్ జరిగిందన్న దృష్టితో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని తొలి దశకు ఎంపిక చేసింది. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర పథకాలకు సరైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ ఫార్మా కార్డులు కీలకం కానున్నాయి.రైతులు తమ భూమిపై పూర్తి అధికారాన్ని రిజిస్ట్రేషన్ ద్వారా పొందడం, ప్రభుత్వ పథకాల లబ్ధిని పారదర్శకంగా అందుకోవడం వంటి ప్రయోజనాలతో ఫార్మా రిజిస్ట్రీ కార్డు వ్యవసాయ రంగంలో మరొక సంచలనాత్మక అడుగుగా నిలవనుంది.

## ఏర్పాట్లు అన్ని సిద్ధం

**- మంచిర్యాల జిల్లా వ్యవసాయాధికారిని కల్పనా**



రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డుల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా వ్యాపాతంగా సుమారు 3.65 లక్షల ఎకరాలలో సాగుచేస్తుండగా, పట్టాదారు రైతులు సుమారుగా 2.90 నుండి 3.10 లక్షలో వరకు ఉంటారని మరి కొంత మంది కౌలు రైతులు కూడా ఉంటారన్నారు. ప్రతీ ఒక్క రైతు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి కార్డుల జారీ మొదలవుతుంది. ఈ ప్రత్యేక కార్డుల జారీకి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ఈ కార్డులు పొందేందుకు రైతులు తమ ఆధార్కార్డు, పట్టాదారు ప్లాస్ పుస్తకంతో తమ దగ్గరలోని సహాయ వ్యవసాయ అధికారులు (ఏఈవో)లను సంప్రదించవచ్చు లేదా మీ సేవా కేంద్రంలో కూడా వివరాలను నమోదు చేయించుకోవచ్చు. కార్డుల జారీకి సంబంధించి యాప్ కూడా సిద్ధంగా ఉంది. రైతుల వివరాలను డిజిటలైజ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పట్టా పాస్ పుస్తకాలున్న రైతులందరూ ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు పొందాలి. రైతులకు అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

## కోర్టు ఆదేశాలు కొట్టిపారేసిన ఎస్ఐ

- ఏసీబీకి చిక్కిన సుగుణాకర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



మంచిర్యాల జిల్లా నస్పూర్ సీసీసీ పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్ఐ) నెల్కి సుగుణాకర్ భారీ అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులకు చిక్కాడు. గతంలో నమోదైన గుప్త నిధుల కేసులో కోర్టు రూ.2 లక్షలు బాధితుడికి ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా, ఎస్ఐ ఆ ఆదేశాలను పట్టించుకోకుండా ధిక్కరించాడు. బాధితుడిని స్టేషన్ చుట్టూ తిరిపిస్తూ, నాకు ఇప్పటికే రూ.1.5 లక్షలు ఖర్చయ్యాయి, నీకు రూ.50,000 మాత్రమే ఇస్తా అంటూ తన వద్ద డబ్బులు లేవన్న నెపంతో వెంట ఒత్తిడులు చేశాడు. చివరికి అతనికి రూ.2 లక్షలు ఇస్తానంటూ ఒక ఫోటో తీసి, తర్వాత తిరిగి కలవమని చెప్పి మాయమయ్యాడు. ఈ వ్యవహారంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. విషయం తెలుసుకున్న అధికారులు నస్పూర్ పోలీస్ స్టేషన్ లో అకస్మాత్తుగా దాడులు నిర్వహించి, ఎస్ఐ సుగుణాకర్ ను అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాలు తుంగలో తొక్కి, బాధితుడిని నానా ఇబ్బందులకు గురిచేసిన ఎస్ఐపై కేసు నమోదు చేసి, అనంతరం కోర్టులో హాజరుపరిచారు. అవినీతి నిరోధక విభాగం అధికారుల ఈ చర్య జిల్లాలో సంచలనం సృష్టించింది.

## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని ఇసుక క్వారీ వద్ద పట్టుకొని, వారి వద్ద నుంచి 290 గ్రాముల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయినవారు కిష్టాపూర్, వేలాల గ్రామాలకు చెందినవారు. ఈ ముగ్గురు ఆసిఫాబాద్‌కు వెళ్లి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి స్వయంగా సేవించడంతో పాటు చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి రూ.500 చొప్పున విక్రయించేవారని పోలీసులు తెలిపారు. వీరి వద్ద మిగిలిన గంజాయిని విక్రయించేందుకు తీసుకొచ్చిన సమయంలో పట్టుకుని, వారి వాహనాలు, గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఆర్వో 15వ వార్షికోత్సవంలో మంచిర్యాల సభ్యులకు గుర్తింపు



**శెనార్తి మీడియా, మంచిర్యాల** : వినియోగదారుల హక్కుల సంస్థ (సీఆర్ వో) 15వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు న్యూఢిల్లీని కనిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వినియోగదారుల రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు నవీన్ శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు రామగురి హరిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. కిరణ్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా మహిళ విభాగం ప్రతినిధి తన్నీరు హేమవతి, జిల్లా అధ్యక్షుడు బాధే రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఇందురీ రమేష్ పటేల్, ఉపాధ్యక్షులు శివ, ప్రణయ్, ప్రశాంత్, సురేందర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పై అవగాహన




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల పట్టణంలోని డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో వాకర్స్‌ను కలసి వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆదేశాలతో, మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిపితే ఎన్నికల ఖర్చు తగ్గి ప్రభుత్వాలపై భారం తగ్గుతుందన్నారు. సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ ద్వారా ప్రజలకు ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ దుర్గం అశోక్, కో కన్వీనర్ తులా ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు అమిరి శెట్టి రాజు కుమార్, పట్టణ కన్వీనర్ ఆకుల అశోక్ వర్ధన్, కో కన్వీనర్ బోయిని హరికృష్ణ, సీనియర్ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, తులా మధుసూదన్, కాశెట్టి నాగేశ్వర్ రావు, చిరంజీవి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## భీమారం లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

- 30 మంది రేకుర్తి ఆసుపత్రికి తరలింపు




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా భీమారం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ మంచిర్యాల గోల్డెన్ జూబ్లీ, లయన్స్ క్లబ్ విజన్ కేర్ సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ భాస్కర్ మాదేకర్ నేతృత్వంలోని రేకుర్తి (కరీంనగర్) ఉదార నేత్ర వైద్యశాల సౌజన్యంతో, వైస్ చైర్మన్ లయన్ చిదురా సురేష్ సహకారంతో నిర్వహించారు. శిబిరానికి 70 మంది ప్రజలు హాజరయ్యారు. వీరిలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించగా, 30 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి రేకుర్తి ఆసుపత్రికి తరలించారని ప్రతినిధి ప్రభాకర్, లయన్ డాక్టర్ కె. సుగుణాకర్ రెడ్డి తెలిపారు. ఆపరేషన్ కోసం వెళ్తున్న రోగులకు, వారి వెంట వెళ్లే వారికీ ఉచిత బస్సు, భోజన సదుపాయాలు కల్పించామని, శనివారం ఆపరేషన్ అనంతరం ఆదివారం భీమారం తిరిగి రానున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ ఫర్ ఐ క్యాంప్స్ లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, లయన్స్ క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు లయన్ పుల్లూరి బాలమోహన్, కోశాధికారి లయన్ కొల్ల వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి విజన్ కేర్ అధ్యక్షుడు లయన్ సయ్యద్ ఇలియాస్, భీమారం మాజీ సర్పంచ్ చేకుర్తి సత్యనారాయణ రెడ్డి, శ్రీ భగవద్గీత అధ్యయన మండలి సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవాన్ని విజయవంతం చేయండి



**శెనార్తి మీడియా, గోదావరిఖని**

4 కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన గులాబీ జెండా, 25 వసంతాల గులాబీ జాతరను ఘనంగా జరుపుకుందామని రామగుండం మాజీ శాసన సభ్యులు, పెద్దపల్లి జిల్లా భారాస అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు.వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన ఏర్పాట్లను లక్ష్మినగర్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన సమీక్షించారు. మార్కండేయ కాలనీలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించి, ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేయకపోతే తెలంగాణ రాష్ట్రం సాధ్యపడేది కాదని, గత ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పట్ల నమ్మకం ఉంచినా, ఆ పార్టీ నాయకులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయలేకపోయారు అని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు రక్షణగా నిలిచిందని, అధికారం కోల్పోయినా ఇప్పటికీ ప్రజల పక్షాన నిలుస్తున్నదని స్పష్టం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణకు నిజమైన రక్షణ కవచం అని వ్యాఖ్యానించారు. ఈ సభలో రామగుండం నియోజకవర్గం లోని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త, నాయకుడు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూతి తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, చల్లా రవీందర్ రెడ్డి, ఆడప శ్రీనివాస్, శ్రీరామోజు మహేష్, నారాయణదాసు మారుతి, రాచకొండ శ్రీనివాస్, గాలి లింగన్న, కాగితం శ్రీనివాస్, గుర్రం పద్మ, మంజుల భాను, ఐల్ల నాగరాజు, బొడ్డు స్వామి, సంజీవ్, సురేష్ కాగితం, గూటం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## మే 20 సమ్మె జయప్రదం చేయాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. శుక్రవారం మార్క్స్ భవన్ లో జరిగిన కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరిగే సమ్మె విజయవంతం కావాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఈ నెల 27న మార్క్స్ భవన్ లో కార్మిక సంఘాల సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో సంక్షోభం

- అధ్యాపకుల రాజీనామా అస్త్రం..
- ఆ పై విధులకు దూరం..
- అసిస్టెంట్ ప్రొఫెసర్ ల మెరుపు ఆందోళన...
- రెగ్యులరైజేషన్ ప్రధాన డిమాండ్..

**శెనార్తి మీడియా, బాసర**





నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ సంక్షోభంలో పడింది. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు మెరుపు ఆందోళనకు దిగారు. గత రెండు దశాబ్దాలుగా కాంటాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొంతకాలంగా తమ ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసింది. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూలత లభించలేదు. ఆ పై ప్రభుత్వం తాజాగా జీవో 21 విడుదల చేస్తూ.. దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగాల భర్తీకి చర్యలకు దిగింది. ఇది బాసర ట్రిపుల్ ఐటిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు నెత్తిన పిడుగుల పడింది. తమను రెగ్యులర్ చేయకపోగా.. కొత్తగా నోటిఫికేషన్ ఇస్తే తమ ఉద్యోగ భద్రతకు వాటిల్లుతుందన్న ఆందోళనతో పాటు తమకన్నా జూనియర్లు రెగ్యులర్ ఉద్యోగాలు తన్నుకుపోతారన్న ఆగ్రహం బాసర ట్రిపుల్ ఐటీ కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల లో నెలకొంది... మూకుమ్మడిగా రాజీనామాట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు బాధితుల నుంచి తప్పుకుంటున్నామని ఇకనుంచి అకడమీక్ బోధన మినహా మరే ఇతర పనులు చేయమని స్పష్టం చేశారు. ఎగ్జామినేషన్ వింగ్, అడ్మిషన్స్, స్టూడెంట్స్ వెల్ఫేర్, హాస్టల్ మెయింటెనెన్స్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఆడిటోరియం, క్యాంపస్ క్యూరేటర్, పరిపాలన విభాగం వంటి అదనపు బాధ్యతలను ఇకపై తాము నిర్వహించలేమంటూ వారికి అప్పగించిన బాధ్యతలకు రాజీనామా చేస్తూ, ట్రిబుల్ ఐటీ పరిపాలన అధికారులకు లేఖలు అందజేశారు. మరోవైపు గత పది రోజుల నుండి 41 మంది కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు బహిష్కరించారు. దీంతో ఒక్కసారిగా ట్రిపుల్ ఐటీలో సంక్షోభ వాతావరణం నెలకొంది.ఈ ప్రభావం విద్యార్థుల తరగతులతో పాటు వారి చదువులపై పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఆందోళన చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను బుజ్జగించే ప్రయత్నాలు యాజమాన్యం చేస్తున్నది. ఈ మేరకు ట్రిబుల్ ఐటీ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ రోజా పరిస్థితి ఆరా తీసినట్లు సమాచారం.. బాసర ట్రిపుల్ ఐటిలో నెలకొన్న తాజా పరిస్థితిలను ప్రభుత్వానికి నివేదించినట్లు కూడా తెలిసింది. అయితే అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. రెండు దశాబ్దాలుగా తమతో అన్ని రకాల సేవలు చేయించుకుని ఇప్పుడు జీవో 21 ప్రకారం కొత్తవారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు. తాజాగా ఉద్యోగ నియామకాల్లో తమకు కనీసం వెయిటేజి కూడా ఇవ్వలేదని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి..